# వైశాల్యం

"ఏమండీ! ఇంకా ఎన్నాళ్ళీ పీడ మనకు?"

"దేన్ని గురించి నువ్వనేది?"

"ఏం తెలీనట్లు మాట్లాడకండి. మీ ఊరి సంతను రప్పించి నాకంట గట్టారు. వాళ్ళకు అడ్డమైన చాకిరి చేయలేక చస్తున్నాను. మీ కడుపులో మాత్రం చల్ల కదలడం లేదు."

"అలా నోరెందుకు పారేసుకుంటావ్? నీ సూటి పోటి మాటలకు తట్టుకోలేక, వారు మొన్ననే పోతామన్నారు. ఇంకో నాలుగు రోజులుండమంటే ససేమిరా అన్నారు. ఇక గత్యంతరం లేక వచ్చే ఆదివారం ట్రైన్‌కి టిక్కెట్లు బుక్ చేశాను. నీవిక నిరభ్యంతరంగా నీ కళ్ళు చల్లార్చుకోవచ్చు."

"అనండి. ఇంత చేసీ మళ్ళీ నన్నే అనండి. మీకు మాత్రం వేరే ఎవరున్నారు గనుక! అనవసరంగా నన్నాడి పోసుకుంటారు కానీ, నాకష్టం, తిప్పలు మీకేమైనా పట్టిందా? పిల్లలకు పరీక్షలు-అటు వారిని చూడాలా? ఇటు మీ జనాలకు కాఫీలు, టిఫిన్లు, భోజనాలు అమర్చాలా? ఇలా మనం వాళ్లను మేపుతూ, ఊరంతా తిప్పుతుంటే ఖర్చు సరే, శ్రమ మాటో? వీళ్లు పది రోజులుండి పోతారు గానీ, ఆ తర్వాత నెల రోజుల వరకు కూడా నేను కోలుకోలేను."

"నీ పాట్లు నాకు తెలీవా సునీతా? కాని వారి తరఫునుంచి కూడా ఆలోచించు. ఏదో మనం పట్టుపట్టాం గదా అని వారు ముంబయి వచ్చారు? వారికింత భోజనం పెట్టి, ఊరు చూపిస్తే అరిగిపోతామా, కరిగిపోతామా? వాళ్ళు మా అమ్మానాన్నలకు చేసే సేవలతో పోలిస్తే, మన శ్రమ ఏపాటి? ఒక్కగానొక్క కొడుకును. మంచి హోదా గల ఉద్యోగంలో ఉన్నాను. ఐనా అమ్మా నాన్నలకు సేవ చేసే అదృష్టానికి నోచుకోలేదు నేను. కారణాలేమైతేనేం. వారు మనతో ఉండడానికి రారు, మనం "ఊళ్ళో" ఉండ లేము. ఇప్పుడు

వీరయ్య దంపతులేగా మా వారిని ఆదుకుంటున్నది? మొక్కుబడిగా నెలనెలా ఇంతని డబ్బు పంపగానే సరిపోతుందా? మనతో, మన పిల్లలతో గడిపే అనుభూతి వారికి దొరుకుతుందా? ఈ వయసులో వారి మానాన వారిని వదిలేసి మనం మాత్రం హాయిగా ఉంటున్నాం. వయసు పండిన మా వారికి అండగా నిలిచాడు వీరయ్య. దినవెచ్చాలు తెచ్చివ్వడం దగ్గర్నుంచి, రోగాలో, నొప్పులో వస్తే చికిత్సకని పట్నం తీసుకుపోయే వరకు అన్నీ అతనే చూస్తున్నాడు. అందుకని కొన్ని రోజులు ఓర్చుకో. ఆ తరువాత మనం మళ్ళీ రమ్మన్నా రారు" ఉద్వేగంగా అన్నాడు వివేక్.

మూతి విరుస్తూ వంట గదిలోకి నడిచింది సునీత.

వీరయ్యది వివేక్ వాళ్ళ ఊరే. పక్కపక్క ఇళ్ళు. ఒక్క కులం వారు కూడా కారు . రక్తసంబంధానికి అతీతమైన అనురాగ బంధం వారిది.

చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన వీరయ్యను చేరదీసింది పార్వతమ్మ. పాలతో పాటు ప్రేమను పంచి, అన్నంలో ఆప్యాయత కలిపి పెద్దజేసింది.

ఆమెకేమాత్రం తీసిపోకుండా వీరయ్య ఆస్తులను చక్కపెట్టారు గౌరీపతి గారు. తన భూములతోపాటు వీరయ్య భూములను కూడా సాగు చేసి తన శ్రమకు ఏమాత్రం ప్రతిఫలం తీసుకోకుండా పైసా పైసాకు లెక్క చూపించారు. యుక్తవయసు రాగానే వీరయ్యకు అప్పగించారు. వివేక్ వీరయ్య కంటే ఐదేళ్ళు పెద్ద. అప్పుడు చదువు నెపంతో, ఇప్పుడు ఉద్యోగ రీత్యా తల్లిదండ్రులకు దూరంగా ఉన్నాడు.

వీరయ్యకెప్పుడూ చదువులో ఆసక్తి లేదు. స్కూలు ఫైనల్‌తో చదువైందనిపించి, గౌరీపతి గారికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. తన పనులతో పాటు గౌరీపతి గారి సేద్యం కూడా చూస్తున్నాడు. మొన్న వైశాఖంలో పెళ్లయింది.

ముంబయిలో గణపతి ఉత్సవాలు ఆర్భాటంగా ఉంటాయని వివేక్ మరీ మరీ బలవంతం చేస్తే భార్యను వెంటబెట్టుకుని వచ్చాడు వీరయ్య.

ఆఫీసుకు సగం దినం సెలవు పెట్టి వచ్చాడు వివేక్. అతిథుల్ని లాల్‌బాగ్ తీసుకెళ్ళాడు. అక్కడ ఇరవై నాలుగడుగుల గణపతి విగ్రహం పెట్టారు. విపరీతమైన జన సందోహం. చాంతాడంత క్యూలో నిలబడితే మధ్యరాత్రి దాటవచ్చు అని, ఐదు రూపాయల విరాళం టిక్కెటు తీసుకుని స్పెషల్ దర్శనం చేసుకున్నారు. సంగీతంతో పాటు వెలిగి ఆరిపోయే "మ్యూజికల్ లైట్స్" కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఎక్కడ చూసినా అట్టహాసం, కోలాహలం. ఓపక్క ఆర్కెస్ట్రా జరుగుతోంది. గణేష్ గల్లీ, చించ్‌పోకిలీ గణపతి విగ్రహాలను కూడా చూసి చెంబూరు బయలు దేరారు. ముంబయిలో అత్యధిక వ్యయంతో నిర్వహింప బడ్తున్న ఉత్సవం చెంబూరులో ఉంది. నగరంలోని పలు ప్రాంతాల వారే కాక బయటి ఊళ్ళనుంచి కూడా వస్తారు జనం ఆ గణేషోత్సవం చూడటానికి.

"సార్వజనీక గణేషోత్సవాలను మొదలుపెట్టింది లోకమాన్య బాల గంగాధర తిలక్. బ్రిటిష్ వారి కళ్ళు కప్పడానికి, రాజకీయ సభలను సమావేశాలకు మతం రంగు పులిమాడు

తిలక్. పది రోజుల పాటు జరిగే ఉత్సవాలలో, జనరంజనతో పాటు, జనచైతన్యం కూడా తీసుకువాచ్చాడు తిలక్. తెల్లవాడి చాపకింద నీరులా పాకి, స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరి పోశారు ఈ ఉత్సవాల ద్వారా. అంత చరిత్రాత్మకమైన ఉత్సవాలు గత రెండు దశాబ్దాలుగా వెర్రి తలలు వేస్తున్నాయి. వీటి నిర్వహణ ఒక వ్యాపారం అయింది. గూండా గ్యాంగులకు తమ సత్తా నిరూపించుకునే పరికరమైంది. సినిమా, సిగరెట్లు, గూట్కా మరియు ఇతర వ్యాపారస్తుల నుండి ఎక్కువ మొత్తంలో విరాళాలు వసూలు చేసి వారి ఉత్పత్తుల ప్రకటనలు భారీ బ్యానర్ల ద్వారా, రోడ్డు మొత్తం ఆక్రమించుకున్న కమాన్ల ద్వారా ప్రదర్శిస్తారు. సినిమాలు, ఆర్కెస్ట్రాలు, నాటకాలు, బ్రేకు డాన్సులు మొదలైన ప్రోగ్రాములుపెడతారు. ప్రతిచోటా అర్భాటం, అట్టహాసమే తప్ప భక్తిభావం మచ్చుకైనా కానరాదు. ఈ ప్రవాహంలో పడి నవ యువకులు పెడ త్రోవ పడుతున్నారు. అదే సంస్కృతిలో కొట్టుకుపోతున్నారు" బస్సు ప్రయాణంలో వివరించాడు వివేక్.

చెంబూర్లో ఢిల్లీ ఎర్ర కోటను పోలిన ప్రవేశ ద్వారం స్వాగతం పలికింది. కోటి రూపాయలకు మించిన ఖర్చుతో, ఓ మాఫియా గ్యాంగ్ ఆధ్వర్యంలో నిర్వహింప బడుతున్న కేళీ విలాసమది. అక్కడ స్పెషల్ దర్శనం ఖరీదు పది రూపాయలు! అవసరానికి మించిన ఆడంబరానికి వెగటు పుట్టింది వీరయ్య జంటకు. బయటి నుండే దండం పెట్టి ఇంటి ముఖం పట్టారు.

మర్నాడు తనకు సెలవు దొరకనందున, పర్యాటక శాఖ వారి "ముంబయ్ దర్శన్"బస్సు టిక్కట్లు తీసిచ్చాడు వివేక్. అతని కంపెనీ ఉంటే బాగనిపించినా, అనుకోని ఏకాంతం వారిని ఆనంద పర్చింది. తమను గుర్తు పట్టే వారు లేరు, అందుకని చేతులు పట్టుకుని చెట్ట పట్టాలు వేసుకుని ముంబయంతా తిరిగారు వీరయ్యా, అంబిక.

ప్రత్యేక మహారాష్ట్ర ఆందోళనలో అసువులు బాసిన వీరుల స్మృతి చిహ్నం, ఫ్లోరా ఫౌంటెన్‌లో చూసి వారి కళ్ళు చెమ్మగిల్లాయి. గేట్ వే ఆఫ్ ఇండియా, తాజ్ హోటల్స్, దగ్గర ఫోటోలు తీసుకున్నారు. మెరీన్ డ్రైవ్ లోని మత్స్యాలయంలో వందల కొద్ది ఉన్న రంగు రంగుల జలచరాలను తిలకించి ముచ్చట పడ్డారు. కమలా నెహ్రూ పార్క్ లోని బూట్ హౌస్ ఎక్కి చిన్న పిల్లల్లా కేరింతలు కొట్టారు. ఆ ఎత్తైన ప్రదేశం నుండి చౌపాటి మొదలు నారిమన్ పాయింట్ కఫ్ పరేడ్ వరకు సాగిపోయిన సాగరాన్ని, ఆకాశాన్ని అంటుకుంటాయేమో అనేట్టుండే భవనాలను చూసి పరవశించారు. వందల సంఖ్యలో బారులు తీరి, చీమల్లా నడుస్తున్న కార్లను, బస్సులను చూసి అబ్బుర పడ్డారు. హ్యాంగింగ్ గార్డెన్స్‌లో కాసేపు కూర్చుని, కూడా తెచ్చుకున్న ఫలహారం భుజించారు. పానీపురి తిన్నారు. మహాలక్ష్మి మందిరంలో దేవి ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. ఇస్కాన్ క్రిష్ణ మందిరంలో భక్తితో పరవశులైన విదేశీయులను చూసి ఆశ్చర్య పడ్డారు. గుండు గీసుకుని మద్దెల వాయిస్తూ క్రిష్ణ స్మరణ చేసే తెల్ల యువతీ యువకులను చూసి నోరు తెరిచారు. బేళ్ తింటూ గుర్రం బండిలో జుహూ బీచంతా తిరిగారు. ఎన్నో ఊసులు చెప్పుకున్నారు.

దేశ ఆర్థిక రాజధానిలో అనంతమైన సాగరంతో పాటు అంతు లేని జన సమూహాన్ని

చూసి ముక్కున వేలేసుకున్నారు. ముంబయిలో డబ్బు సంపాదించడమే కాదు, దాన్ని నీళ్ళలా ఖర్చు పెట్టవచ్చని తెలుసుకున్నారు వీరయ్య, అంబిక.

అసలే ముభావంగా ఉన్న సునీతను ఇంకా ఇబ్బంది పెట్టకుండా రాత్రి భోజనం కూడా బయటే కానిచ్చి,ఘాట్కోపర్ లోని వివేక్ ఇంటికి చేరుకున్నారు. పొద్దున ఆ మాట చెప్పినపుడు మొహమాటానికి కూడా బయట ఎందుకు భోంచేసి వస్తారని అనలేదు. సునీత.

వీరయ్య దంపతులను "ఛత్రపతి శివాజి టర్మనస్" (వి.టి.) స్టేషన్లో "హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్" ఎక్కించాడు వివేక్. ప్రత్యేకంగా పిలిచి, ముంబయి రప్పించి, వారికి సరియైనఆతిధ్యం ఇవ్వలేక పోయినందుకు దోషిగా ఫీలయ్యాడతను. తన మాతాపితలు జ్ఞప్తికి వచ్చి కళ్ళకు నీళ్ళొచ్చాయి.

"మా వాళ్ళకు మీరే దిక్కు. ఇక్కడి విషయాలు మనసులో పెట్టుకోకుండా ఎప్పటి వలెనే వారిని కనిపెటుకుని ఉండండి. " మాటలు పెగలడం భారం కాగా దగ్గుత్తికతో అన్నాడు వివేక్. వీరయ్య, అంబికల కళ్ళు కూడా అశ్రువులతో మసకబారాయి.

"నువ్వేం బెంగ పెట్టుకోవద్దు వివేక్! నన్ను కనకున్నా వారే నా జననీ జనకులు. నాలోని ప్రతి రక్తం బొట్టు పార్వతమ్మ గారి చలవే. ఇక బాబాయి గారే నన్ను చేరదీయక పోతే మా బంధువులు ఆస్తిని ఏం చేసేవారో! ఇప్పుడిలా సుఖంగా బతుకుతు వెళ్ళ దీస్తున్నామంటే అది మీ వాళ్ళు పెట్టిన బిక్షే. అలాంటప్పుడు నీవింతగా చెప్పాలా? వారు ఏ మాత్రం బాధ పడకుండా చూడటం నా కనీస కర్తవ్యం. వారిని కంటికి రెప్పలా కాపాడటం నా విద్యుక్త ధర్మం. సిటీలో ఉండే వారి సాధక బాధకాలు మాకు తెలియవా? నువ్వు మనసు కష్ట పెట్టుకోవద్దు. దీపావళి సెలవుల్లో అందరూ ఊరికి రండి. హాయిగా గడుపుదాం" వీరయ్యతో పాటు అంబిక కూడా చేతులు జోడించింది.

రైలు కనుమరుగయ్యే దాకా చేయి ఊపుతూనే ఉన్నాడు వివేక్.

కొత్త జంటకు అపరిచిత జనం మధ్య మళ్లీ "ఏకాంతం" లభించింది. ఎక్కడెక్కడో తిరిగి సంభాషణ సునీత వైపు మళ్ళింది.

"ఇంతకు ముందు ఎంతో ఆదరంతో చూసిందన్నారు?"

"అవును అంబీ, నా కదే ఆశ్చర్యంగా ఉంది ఐదేళ్ళ క్రితం నేను ముంబయి వచ్చినపుడు వివేక్ వారం రోజులు సెలవు పెట్టాడు. అప్పుడు వారున్నది ఒంటి గది ఇంట్లో, అదే హాలు, వంట గది, పడక గదిగా వాడే వారు. నాకు అటకపై పడక ఏర్పరిచారు. వారా కొత్తగా పెళ్ళయిన వారు. వారి మధ్య ఆ ఇరుకు గదిలో ఉండటం నాకే మొహమాటమైంది. వారు మాత్రం చాలా ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చారు. నాతో పాటు స్వయంగా వచ్చి అన్నీ చూపించారు. వారి పుట్టు పూర్వోత్తరాలు వివరించారు. సునీత గారు కూడా ఓ సోదరిలా వారం రోజులు చేసిన వంటకం మళ్ళీ చేయకుండా కడుపు ఉబ్బిపోయేట్టు విందు భోజనాలు అమర్చారు. అందుకే ఆవిడ ఈ సారి ప్రవర్తనను జీర్ణం

చేసుకోలేక పోతున్నాను." వీరయ్య వివరించాడు.

"సునీత గారి ప్రవర్తన కొంత అర్థం చేసుకున్నాను. మీరు ఇంతకు ముందు వచ్చినపుడు ఆవిడ కూడా ముంబయికి కొత్తే, మిమ్ముల్ని చూసే సరికి ఊరి నుంచి ఆత్మబంధువు వచ్చినట్టనిపించి ఉంటుంది. ఇప్పుడో? వారి పెళ్ళై అయిదు సంవత్సరాలైంది. ఇద్దరు పిల్లలు పుట్టారు. భర్తకు ప్రమోషనొచ్చింది. హోదా పెరిగింది. నాలుగు గదుల క్వార్టరు దొరికింది. వీటన్నిటితో ఆవిడలో మార్పు వచ్చింది. స్వార్థం చోటు చేసుకుంది. దర్పం వచ్చింది. ఆమె హై సొసైటీలో చేరింది. ఎంతయినా మనం పల్లెటూరి వాళ్ళం. వారికి తూగుతామా?" బి.ఎ.(సైకాలజీ) చేసిన అంబిక విశ్లేషణ.

"అంటే ఇంటి వైశాల్యం పెరగటంతో పాటు హృదయం కుంచించుకు పోయిందంటావ్?"

"హృదయం కంటే, మనసు కుంచించుకు పోయిందంటాను. ఆమె హృదయంలో మనకు స్థానం ఉన్నట్టు లేదు. ఆమె పిల్లలు, వారి భవిష్యత్తుపై దృష్టి మరలించింది. ఆ మాత్రం స్వార్థం అసహజమేమీ కాదు. అదీ కాక ఇప్పుడామె ముంబయిలో పాత బడింది. పై మెట్టునున్న వారితో స్నేహాలు, పరిచయాలు పెరిగాయి. ఇక మనమెలా ఆమె కంటికి ఆనుతాం?"

"మన వాళ్ళు రమ్మని ఎంతో బలవంతం చేశారు కదా అని మనం వచ్చాం? ఓ వారం రోజులు మనతో సఖ్యతతో ఉంటే ఏం పోయేది? నీవు వంటలో సహాయం చెయ్యబోతే నిరాకరించింది, పిల్లలకు చదువు చెపుతానంటే వద్దంది. పొమ్మన లేక పొగ పెట్టినట్టు, సూటి పోటి మాటలు నాకు మాత్రం చాలా బాధ కలిగింది" వీరయ్య తన మనసులోని మాట చెప్పాడు.

"అభిమాన ధనుడాయె! వివేక్ గారు పాపం చాలా నలిగి పోయారు. ఆయన ముఖం చూసైనా మీరు ఆ విషయాలు మరిచి పోవాలి. ఆ, మనం హైద్రాబాద్‌లో రెండురోజులుండి నాగార్జున సాగర్ వెళ్దామా?" విషయాన్ని వేరే దారికి మళ్ళించింది అంబిక.

ఇక్కడ వివేక్ కూడా మథన పడుతున్నాడు. చిన్నప్పటి నుంచి కలిసి మెలసి ఉన్న స్నేహితుడు పెళ్ళి చేసుకుని భార్యతో సహా తన ఇంటికి వస్తే వారికి సరైన ఆతిథ్యం ఇవ్వలేక పోయానే అని చింతించాడు. సునీత ఈ విషయంలో తనకు సహాయం చేయలేదే అని బాధ పడ్డాడు.

పిల్లల పరీక్షలయ్యాయి. ఓ ఆదివారం బోరీవలీ నేషనల్ పార్క్ వెళ్లారు. వివేక్ కుటుంబం చిన్న ట్రైన్లో కూచుని పార్కు చుట్టూ తిరిగారు. బోటింగ్ చేశారు. తెచ్చుకున్న ఫలహారాలు భుజించి పచ్చిక బైల్లో కూచున్నారు. పిల్లలు జారుడు బండలపై జారుతుంటే ఎంతో ఆనందంగా ఉంది. భార్య మూడ్ బాగుండడం చూసి గొంతు సవరించుకున్నాడు వివేక్. "సునీ, నువ్వేం అనుకోనంటే నేనో మాట చెప్పనా?"

"నేననుకున్నా మీకేం పట్టదు కదా? చెప్పండి" సునీత టోన్ మారింది

"ఇదిగో నువ్వలా బిర్రడాసుకుంటే నేనేం మాట్టాడను" గారం పోయాడు వివేక్.

"నేనేం అనుకోను. చెప్పండి" శాంతంగా అంది సునీత.

"చూడు సునీ నన్నపార్థం చేసుకోవద్దు. నీకు పేర్లు పెడుతున్నాననుకోవద్దు. నా మాటలు సావధానంగా విని సావకాశంగా ఆలోచించు, అప్పుడు నాబాధ నీకర్థమౌతుంది."

ఫ్లాస్కు లోనుండి కాఫీ పోసుకుని తాగుతూ కొనసాగించాడు.

"వస్తూ పోతుంటేనే బంధుత్వాలు గట్టి పడతాయి. ఇక్కడ బంధుత్వమంటే రక్త సంబంధం మాత్రమే కాదు. దానికి మించిన స్నేహానికీ అది వర్తించవచ్చు. ఖర్చుకో, శ్రమకో ఓర్చుకోక మాట పారేసుకుంటే మనసులు విరుగుతాయి. సంబంధాలు దూరమవుతాయి. అప్పుడు మన సంపాదనకు, ఆస్తికి, ఐశ్వర్యానికీ అర్థం ఏమిటి? ఎప్పుడూ మన వైపు నుండే కాక ఎదుటి వారి పరంగా కూడా ఆలోచించాలి. అప్పుడు అపోహలకు, అపార్థాలకు ఆస్కారముండదు. మనకు చాలా కావలసిన వీరయ్య భార్య అంబిక కొత్త పెళ్ళై మనింటికి వచ్చింది. చదువుకున్న పిల్ల. తాను పట్టాపుచ్చుకున్నా, మెట్రిక్ వరకు మాత్రం చదివిన వీరయ్యను వివాహం చేసుకుంది. నువ్వూ డిగ్రీ హోల్డర్ వే. అందుకని మీ ఇద్దరి మధ్యా పరస్పరావగాహనకు ఆటంకం లేదు. ఐనా నీ పుల్లవిరుపు మాటలతో ఆమె మనసు గాయ పర్చావు. వాళ్ళు వినాలని, కావాలనే నాతో గొంతు పెంచి గొడవ పెట్టుకున్నావు."

"మీకు గొంతు మాత్రమే తెలిసింది, కాని నేనెందుకు అలా అనవలసి వచ్చిందో ఆలోచించారా?"

"అన్నీ ఆలోచించే నీతో ఇలా మనసు విప్పి మాట్లాడుతున్నాను. పిల్లల చదువు పట్ల నీ శ్రద్ధను అర్థం చేసుకోగలను. వంటలోనో, వారికి చదువు చెప్పడంలోనో అంబిక సహాయం తీసుకుంటే పోయేది. ఆమె చేస్తానని ముందుకు వచ్చినా తిరస్కరించావు. మనం ఊరికి వెళ్ళిన ప్రతి సారి వీరయ్య మనకు చేసిన సేవ జ్ఞప్తికి తెచ్చుకో. మన పూజలకని, నోములకని ట్రాక్టర్‌లో తిప్పడం, కూరగాయలు ఇవ్వడం, నువ్వులు, చింతపండు మొదలైన దినుసులు ముంబయికి తీసుకు వెళ్ళమని ఇవ్వడం. ఇవన్నీ ఎలా మరిచావు? పది రోజులకే విసుగు చెందావు కాని వారో? కొడుకునైన నేను ఇక్కడున్నా, మావారికి కొడుకై అండగా నిలిచాడు వీరయ్య, అతని ఋణం మనం ఎలా తీర్చుకోగలం? చదువుతో పాటు సంస్కారం పుణికి పుచ్చుకున్న అంబిక కూడా తన భర్తకు, అతని ఇష్టానిష్టాలకు అనుగుణంగా నడుచుకుంటోంది. తలుపులు మూసి ఉండే ఫ్లాటు సంస్కృతిలో పడి హృదయం కూడా మూసుకుంటే ఎలా? పరాయి వారిని సమర్థిస్తూ, ఇంట్లో గొడవ చేస్తున్నాననుకోక నిదానంగా ఆలోచించు" వివేక్ ముగించాడు.

సునీత మౌనంగా బయలు దేరడానికి లేచింది.

అంబికను, వీరయ్యను క్షమించమని సునీత ఉత్తరం రాసిందని వీరయ్య జాబు చదివితే గాని తెలియలేదు వివేక్‌కు. ఆకాశం నిర్మలంగా ఉంది! ★